క్లుప్తంగా

అన్నసమారాధన

దేవరపల్లి: స్థానిక శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న మండలంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ

గోపాలపురం: వేసవిలో సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం శాఖ గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి వెజ్జు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకూ విద్యార్థులకు గ్రంథాలయం సందర్శన, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ వంటి వాటిపై శిక్షణ ఇస్తారన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ఇటీవల అంగన్‌వాడీ ఆయా వర్కర్ల పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నియామక పత్రాలు అందజేశారు. మూడు మండలాల్లో 12 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఐసీడీఎస్ పీఓ సుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

నల్లజర్ల: వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లలో చిన్న రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. ఒక్కో ఆర్‌బీకేకు ఒక్కో మిల్లు కేటాయించినట్టు చెప్పారు. రెండెకరాలు పైబడిన రైతులకు ప్రత్యేకించి అనపర్తిలో ధాన్యం తరలించేలా లారీలు, గోనె సంచులు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ధాన్యం అమ్మకాలలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడ్డా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

గుంటూరు వెళ్లి.. పింఛను అందించి..

నిడదవోలు: పట్టణంలోని 4వ వార్డుకు చెందిన షేక్ అసీఫ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ పెద్ది రాగమాలిక గుంటూరు వెళ్లి అసీఫ్‌కు వృద్ధాప్య పింఛను నగదును మంగళవారం అందించింది. వలంటీర్ రాగమాలికను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

నల్లజర్ల: లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో యోగా, చెస్ అంశాలలో యోగా గురువు, జెడ్పీహైస్కూలు పీఈటీ దూబగుంట్ల రాజారావు ఆధ్వర్యంలో తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు.

నేడు పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



బోద వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టి, వ్యాధులకు దూరంగా ఉండొచ్చని వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషాదేవి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా (బోద వ్యాధి) వ్యాప్తి చెందే విధానంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ జిన్నూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, కె.కుమారి, కె.సుభాషిణి, కె.నాగమణి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కొవ్వూరు: మే డే వారోత్సవాల్లో భాగంగా రిక్షా కార్మికుల యూనియన్ కోశాధికారి మంచిలి వీరబాబు మంగళవారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. బండారు అప్పలనాయుడు, మాసవరపు నాయుడు, కరిమించి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ..

- గ్రామాల్లో వ్యాయామ వైద్యం
- పీహెచ్‌సీల్లో హెల్త్ ప్రొవైడర్ల ఏర్పాటు
- యోగా, ఏరోబిక్స్‌లో వారికి శిక్షణ



అనంతపల్లి సబ్ సెంటర్‌లో రోగులను పరీక్షిస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్

నల్లజర్ల: ప్రజలను మానసిక ఒత్తిడి, రుగ్మతల నుంచి బయట పడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆయుష్మాన్ భారత్ ప్రాజెక్ట్ కింద నియమించిన మిడ్‌లెవల్ హెల్త్‌ప్రొవైడర్ల ద్వారా ప్రజలకు యోగా, ధ్యానం, ఏరోబిక్స్‌పై శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించి అమలులోకి తెచ్చింది. నాలుగు దశల వరకూ నియమితులైన హెల్త్ ప్రొవైడర్లకు యోగా, ఏరోబిక్స్(సంగీతంతో కూడిన వ్యాయామం)పై శిక్షణ పూర్తయింది.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా దాదాపు నాలుగేళ్ల క్రితం మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సబ్ సెంటర్లలో నియమించారు. వీరికి వేతనాలను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. మిగతా విషయాలలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. బీఎస్సీ నర్సింగ్ పూర్తయిన వారికి అవకాశం కల్పించారు. వీరంతా ఉపకేంద్రాల పరిధిలో పని చేస్తూ వివిధ రుగ్మతలతో తమ దగ్గరకు వచ్చే వారికి ప్రాథమిక చికిత్స అందిస్తారు. గర్భిణులు, బాలింతలకు నెలకోకసారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడంతో పాటు వివిధ విషయాలపై అవగాహన కలిగించి, వ్యాయామాలు చేసిస్తారు.సూచనలు, సలహాలతో పాటు అవసరాన్ని బట్టి వైద్యం చేస్తారు. బీపీ, షుగర్, క్షయ తదితర పరీక్ష చేసి, చికిత్స అందిస్తారు.

హెల్త్ ప్రొవైడర్ల విధులు

గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు హెల్త్ ప్రొవైడర్లు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రజలకు ప్రాథమిక చికిత్సతోపాటు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, రుగ్మతుల నివారణకు వ్యాయామాలు చేయిస్తున్నారు. గర్భిణులకు సుఖ ప్రసవాల కోసం ఆసనాలు నేర్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించి, అక్కడ అందించే ఆహారం నాణ్యతను పరిశీలిస్తున్నారు. సబ్‌సెంటర్లకు రాలేని వారి కోసం ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్నారు. తమ పరిధిలోన్న ఉన్న నాలుగైదు వేల మంది ఆరోగ్య పర్యవేక్షణ బాధ్యతలు వీరే చూస్తున్నారు. అవసరమైన సందర్భాల్లో ఏలూరు, విజయవాడలలో ఉన్న ఆరోగ్యహబ్‌లకు కాల్ చేసి నిపుణులైన వైద్యులతో పేషెంట్‌ను మాట్లాడించి టెలీమెడిసన్ సహాయం తీసుకుంటారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలంలో 16, గోపాలపురం మండలంలో 15, దేవరపల్లి మండలంలో 17 సచివాలయాల పక్కనే ప్రతి గ్రామంలో వీరి కోసం వెల్‌నెస్ సెంటర్లు నిర్మాణంలో వివిధ దశలలో ఉన్నట్టు పంచాయతీ రాజ్ డీఈ బాలకృష్ణ తెలిపారు.

శిక్షణ పూర్తి



ప్రజలకు మందులివ్వడం, వారి ఆరోగ్యంపై నివేదికలు ఇవ్వడం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం యోగా, ఏరోబిక్స్‌లలో శిక్షణ పూర్తయింది. గ్రామాల్లో ప్రజలు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, వారి ఆరోగ్యాన్ని పెంపొందించడంలో భాగస్వాములవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– విజయలక్ష్మి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఆవపాడు

సద్వినియోగం చేసుకోవాలి



యోగా, ధ్యానం, ఏరోబిక్స్ వంటివి దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. అందరూ డబ్బులు సంపాదనలో పడి ఆరోగ్యాన్ని పట్టించుకోవడంలేదు. అయితే కరోనా వచ్చినప్పటి నుంచి కొంచెం శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికే కొంత మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు.

– తెల్లం గంగాధరరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నల్లజర్ల

కల్యాణోత్సవానికి అంకురార్పణ



స్వామివారి కల్యాణోత్సవానికి అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

నల్లజర్ల: అనంతపల్లిలోని మదనగోపాలస్వామి తిరుకల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. వేద పండితులు పెదపూడి విజయ వెంకటరమణ, ఆలయ అర్చకులు దివి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. బుధవారం వేదికపై స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ మద్దిరాల శరణ్య, ఆలయ కమిటీ చైర్మన్ కానుబోయిన గంగాధరావు తెలిపారు.

నేడు కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొవ్వూరు: ఐ.పంగిడిలో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.కోటి మంజూరు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దేవరపల్లి, నల్లజర్ల గ్రామాల రోడ్ల పరిశీలన



అధికారులతో కలిసి సెంట్రల్ లైటింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి/నల్లజర్ల: దేవరపల్లి, నల్లజర్ల గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దేవరపల్లి, నల్లజర్ల గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసే రోడ్డును మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉందని, రాత్రిళ్లు రోడ్లు అంధకారంలో ఉంటున్నాయన్నారు. రెండు గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ సెంటర్ స్తంభాలు ఏర్పాటుకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ(రుడా)కు ప్రతిపాదనలు పంపించగా రూ.కోటి మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. దేవరపల్లిలో రూ.50 లక్షలు, నల్లజర్లలో రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. దేవరపల్లిలో పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వద్ద గల వినాయకుడి ఆలయం వరకూ, దేవరపల్లి మూడు రోడ్లు కూడలి నుంచి గోపాలపురం రోడ్డులోని స్పీడ్‌బ్రేకర్ల వరకూ సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. నల్లజర్ల సెంటర్‌లో గుండుగొలను-కొవ్వూరు రోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్డులో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. దేవరపల్లిలో మూడు రోడ్ల జంక్షన్, బస్టాండ్ వద్ద, నల్లజర్ల జంక్షన్ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. గోపాలపురం రోడ్డులో కొత్త హైవేలోని డైమండ్ జంక్షన్ వరకూ సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్టు ఆయన చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. రుడా డీఈఈ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 30 మీటర్లకు ఒక స్తంభం ఏర్పాటు చేసి లైటింగ్ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. దేవరపల్లిలో సుమారు 1000 మీటర్లు, నల్లజర్లలో 1000 మీటర్ల పొడవున డివైడర్ నిర్మాణం చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, మండల గృహసారధుల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, రుడా ఏఈ ఎస్‌వీవీ దుర్గాప్రసాద్, ఎలక్ట్రికల్ ఏఈ ఎన్. భ్రమరాంబికాదేవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



గణేష్ సెంటర్లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, కౌన్సిలర్లు

నిడదవోలు: పట్టణాభివృద్ధి లక్ష్యంగా వివిధ అభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు పట్టణంలోని గణేష్ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ ప్రధాన రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ఆయన కౌన్సిలర్‌తో కలసి పరిశీలించారు. పనుల్లో ఎక్కడ నాణ్యత లోపించిన సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. మున్సిపల్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు వంటి అభివృద్ధి పనులను చేపట్టినట్టు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, ఎలగడ బాలరాజు, మున్సిపల్ డీఈ మాధవిలత, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నయనానందం.. వేంకటేశుని కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న పండితులు



గోపాలపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు రెండో రోజు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచే క్యూ కట్టారు. భక్తులతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులందరికి ఉదయం సాయంత్రం ఉచిత అన్నసమారాధన నిర్వహించారు.

అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం

అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి కనుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు తిలకించారు.

వైభవంగా వేంకన్న కల్యాణం

గోపాలపురం: వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా గోపాలపురంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు, వేంకటేశ్వర సీతా రాముల ఆలయ చైర్మన్ పడమట సత్యనారాయణ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. పడమట భద్రం దంపతులు కల్యాణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది.

ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కొవ్వూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను మళ్లీ అమలు చేయాలని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రౌండ్ టేబుల్ సమావేశంలోనాయకులు డిమాండ్ చేశారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో నాయకులు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై చేస్తున్న దాడులపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, మాల మహాసభ నాయకులు బొంతా శ్యాం రవిప్రకాష్, బహుజన ఫ్రంట్ నాయకులు గుంపుల సత్యకృష్ణ, సీఐటీయూ, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల పరిశీలన



సమావేశంలో పాల్గొన్న వక్ఫ్ బోర్డు సభ్యులు

తాళ్లపూడి: ముస్లిం సోదరులందరూ జమాతలకు అతీతంగా వక్ఫ్ బోర్డుకు సహకరించాలని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ ఆరీఫ్ అన్నారు. తాళ్లపూడిలోని మసీదును మంగళవారం జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు సందర్శించారు. జిల్లాలోని మసీదులను, దర్గాలను, మదరసాలను, షాధీఖానాలను సందర్శించినట్టు వారు తెలిపారు. అలాగే రాజమండ్రి, రాజమండ్రి రూరల్ గ్రామాల్లో కూడా మసీదులను పరిశీలించారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షరీఫ్, జిల్లా సభ్యులు అహ్మద్ మహమ్మద్, షేక్ జిలాని, సత్తార్ భాషా, సత్తార్ ఇస్మాయిల్, మసీదు ప్రెసిడెంట్ సర్దార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది



పాలంగిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ఉండ్రాజవరం: వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ పాలాటి అన్నారు. మండలంలో పాలంగి, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో మంగళవారం ఆమె వరి చేలను, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలు కురవడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుకు, అధికారులకు నివేదిక అందజేసినట్టు ఆమె తెలిపారు. ఆమె వెంటపాలాటి శరత్‌బాబు, వీఆర్వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

5న చండీ హోమం

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో ఈ నెల ఐదో తేదీన వైశాఖ పౌర్ణమి సందర్భంగా చండీ హోమం ఉదయం తొమ్మిది గంటల నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎస్ఎస్ వాజ్‌పేయ్ తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేయనున్నట్టు ఆయన ప్రకటించారు.

కరాటే బెల్టు టెస్ట్‌ల్లో చిన్నారుల ప్రతిభ



బెల్టు టెస్టులకు ఎంపికైన క్రీడాకారులతో అవంతీ ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్

కొవ్వూరు: ఇటీవల పట్టణంలో అచీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో బ్లాక్ బెల్ట్, కలర్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ బెల్ట్ టెస్టుకి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌కే మొహ్సిన్ అహ్మద్, ఎస్.బిందు, ఎస్‌కే ఇమ్రావలీ, కార్తికేయ, ఎం.దర్శిత్, పి.జశ్వంత్, జి.సూర్య అవినాష్, ఎ.షణ్ముఖ, కె.హర్షిత, ఎస్.అజ్మ, సీహెచ్ మహిధర్, జి.వసుధర్ ఎంపికయ్యారు. ఆరంజ్ బెల్టుకి ఎం.ధృతి, జి.నేహంత్ సాయి, పి.దివ్య, ఎం.తేజశ్రీ ఎంపికయ్యారు. బ్లూబెల్ట్‌కు వి.సిద్ధార్థ, సీహెచ్ యోజిత్‌నంద, సీహెచ్ కార్తికేయ, యు.పార్థు ఎంపికయ్యారు. గ్రీన్ బెల్టుకి ఐ.దీవెన, ఎం.వంశీ, కె.శ్రీసాయి, బి.దార్మిక్, ఐ.సన్నీ ఎంపికయ్యారు. పర్పుల్ బెల్ట్‌కు ఎం.పార్థు కార్తీక్, ఎన్.ఖ్యాతి, జి.శ్రీత ఉత్తీర్ణత సాధించినట్టు నిర్వాహకురాలు ఆకుల రాధ తెలిపారు. ఏప్రిల్ 30, మే ఒకటో తేదీ రెండు రోజుల పాటు నిర్వహించిన బెల్టు టెస్టుల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా అవంతీ ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని పాల్గొన్నారు. ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ షిహాన్, డీఎల్ నారాయణల ఆధ్వర్యంలో బెల్టు టెస్టులు నిర్వహించామని రాధ తెలిపారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి

కొవ్వూరు: పింఛనుదారులు విధిగా తమ సీఎంఎఫ్ఎస్ ఐడీలను ఆధార్ లింకు చేసిన మొబైల్ ఫోన్‌కి అనుసంధానం చేసుకోవాలని సహాయ ఖజానాధికారి యూవీవీ బసవరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎఫ్ఎం ఎస్ ఐడీ, హెచ్ఈఆర్‌బీ పేలకు అనుసంధానం అత్యవసరమని అన్నారు. ఈనెల పదో తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 3, 4 తేదీల్లో తాళ్లపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఆ మండల పెన్షన్‌దారులకు, 5, 6 తేదీల్లో దేవరపల్లి ఎంపీడీవో కార్యాలయంలోను ఆ మండలంలో పెన్షన్‌దారులకు ఈకేవైసీ నమోదుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొవ్వూరు మండల పరిధిలోని పెన్షన్‌దారులకు డివిజనల్ సబ్ ట్రెజరీ కొవ్వూరు కార్యాలయంలోను ఈకేవైసీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

అకాల వర్షం.. అనుకోని నష్టం



తీపర్రులో తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెడుతున్న రైతులు



నల్లాకులవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు



సమిశ్రగూడెంలో తడిసిన మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు సత్యనారాయణ

పెరవలి: అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. చేతికి అందిన పంట నోటికి దక్కకుండా చేసిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోగా, వరిచేలు నేలకొరిగాయి. మంగళవారం ఉదయం మేఘాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. తర్వాత ఎండ రావడంతో ధాన్యం రాశులు తెరిచి రోడ్లపై ఆరబెట్టారు. వాతావరణ శాఖ మరో 5 రోజులు వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం ఆరిపోతే ఎలాగోలాగా కాపాడవచ్చని కానీ కోతలు పూర్తి అవ్వని పంటను ఎలా కాపాడుకోవాలని భయపడుతున్నారు. పెరవలి మండలంలో నిడదవోలు-నరసాపురం, వడలి-ముక్కామల, జాతీయ రహదారి పూర్తి స్థాయిలో రైతులు ధాన్యం ఆరబెట్టారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, గోపవరం, పెండ్యాల, పందలపర్రు, మునిపల్లి గ్రామాల్లో కోత దశకు చేరుకున్న అత్యధిక శాతం వరి పంట నేలకొరగింది. కళ్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దాయ్యాయి. మరో పక్క పంట పొలాల్లో భారీగా నీరుచేరడంతో నేలనంటిన వరికంకులు మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటమునిగిన వరిపొలాలను మంగళవారం ఏఓ జి.సత్యనారాయణ పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

మండలంలో భారీ వర్షం

చాగల్లు: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి వరితో పాటు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో ఈదురుగాలులకు సుమారు 450 ఏకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా గుర్తించమని కొవ్వూరు ఉద్యాన శాఖాధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. అక్కడక్కడ మొక్కజొన్న తోటలకు నష్టం వాటిల్లిందని అన్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని తెలిపారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

చాగల్లు: వేసవిలో విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని చాగల్లు గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. 40 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. కథలు చెప్పడం, పుస్తక పఠనం, కంప్యూటర్ నేర్పించడం, పాటలు, డ్రాయింగ్, వ్యాస రచన వంటి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ప్రతిరోజు తరగతులు ఉంటాయని తెలిపారు.

వినతులను తక్షణం పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.గంగరాజు సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించారు. నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన అర్జీలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పింఛన్లు, ఇళ్లస్థలాలకు సంబంధించి అర్హులైన జాబితాను సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సివిల్ సప్‌లై డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: న్యాయస్థానాల్లో కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించేందుకు ఆసక్తి కలవారి నుంచి మీడియేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈనెల నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విశ్రాంత న్యాయమూర్తులు, ఏడేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదులు, వివిధ వృత్తుల్లో 15 ఏళ్ల అనుభవం కలిగిన నిపుణులు అర్హులన్నారు.